క్లుప్తంగా


నేడు స్వామి వారి కల్యాణం

రేగొండ: మండలంలోని కొడవటంచ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో స్వాతి నక్షత్రం సందర్భంగా నేడు (బుధవారం) స్వామి వారి కల్యాణం నిర్వహించనున్నారు. ఈమేరకు ఆలయ ఈఓ మహేష్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

సమావేశానికి తరలిరావాలి

ఎస్ఎస్‌తాడ్వాయి: జిల్లా కేంద్రంలోని లీలా గార్డెన్‌లో రేపు(గురువారం) నిర్వహించనున్న కాంగ్రెస్ పార్టీ సమావేశానికి మండలంలోని నాయకులు, కార్యకర్తలు, పార్టీ ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో తరలిరావాలని పార్టీ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్ మంగళవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ అధ్యక్షతన నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచార సమావేశాని ముఖ్య అతిథులుగా మంత్రి సీతక్క, ఎంపీ అభ్యర్థి బలారాంనాయక్ హాజరవుతారన్నారు. సమావేశానికి మండలంలోని పార్టీ అనుబంధ కమిటీల నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలన్నారు.

నియామకం



గోవిందరావుపేట: బీఆర్ఎస్ మండల కన్వీనర్‌గా లకావత్ నరసింహ నాయక్‌ను మంగళవారం నియమించారు. ఈ సందర్భంగా నరసింహ నాయక్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పజెప్పిన పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్ బాబుకి, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్‌కి, జెడ్పి చైర్‌పర్సన్ బడే నాగజ్యోతికి తదితర నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. మండలంలో పార్టీ బలోపేతం కోసం పని చేస్తానని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



క్షతగాత్రుడు రాజు

గణపురం: రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలైన సంఘటన మండలంలోని మైలారం గ్రామ సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై మచ్చ సాంబమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. మండలకేంద్రానికి చెందిన కొలేపాక రాజు, మల్యాల అనిల్, కేంబర్తి భానుచందర్ మేస్త్రీ పనులు చేసే క్రమంలో రేగొండకు వెళ్లి వస్తున్నారు. ఈ క్రమంలో మైలారం శివారు నూతనంగా నిర్మిస్తున్న పెట్రోల్ బంక్ వద్ద రాగనే ముందు వెళ్తున్న టాటా ఏసీ వాహనం ఢీ కొట్టుకోవడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్పందించిన స్థానికులు 108 వాహనానికి సమాచారం అందించడంతో ముగ్గురు క్షతగాత్రులను ములుగు సివిల్ ఆస్పత్రికి తరలించారు. కాగా, రాజు పరిస్థితి విషమంగా ఉండడంతో పాటు మరో ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో వారిని ములుగు సివిల్ ఆస్పత్రి నుంచి వరంగల్ ఎంజీఎంకు తరలించారు.

తప్పిన ప్రమాదం



మొగుళ్లపల్లి: మండల కేంద్రం శివారులోని కబరస్తాన్ వద్ద మంగళవారం మధ్యాహ్నం వచ్చిన ఈదురు గాలికి విద్యుత్ తీగలు ఒక దానికికొకటి తగిలి మంటలు ఏర్పడి పక్కనే ఉన్న వరి గడ్డి అంటుకుంది. గమనించిన స్థానిక రైతులు వెంటనే పోలీస్ స్టేషన్, గ్రామ పంచాయతీకి సమాచారం అందించారు. స్పందించిన ఎస్సై అశోక్, మాజీ సర్పంచి ధర్మారావు, సిబ్బంది జీపీ వాటర్ ట్యాంకర్ తీసుకువచ్చి మంటలను ఆర్పివేశారు. ఏమాత్రం ఏమరపాటు వహించిన చేతికి వచ్చిన వరిపంటలు దగ్ధమయ్యేవని స్థానిక రైతులు అన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

వాజేడు: పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా మండల పరిధిలోని 13 పోలింగ్ కేంద్రాలను మంగళవారం తహసీల్దార్ ఎస్ శ్రీనివాస్ పరిశీలించారు. మౌలిక వసతులైన ర్యాంపులు, విద్యుత్, నీటి వసతి, మరుగుదొడ్లు తదితర వివరాలను సేకరించారు. జంగాలపల్లి, మర్రిగూడెం, నాగారం, కొంగాల, అరుణాచలపురం, పూసూరు, ప్రగళ్లపల్లి, ఏడ్జర్లపల్లి, మొరుమూరు గ్రామాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలను పరిశీలన చేశారు. అలాగే అరుణాచలపురం, మర్రిగూడెం, ఏడ్జర్లపల్లి, మొరుమూరు గ్రామాల్లో ఆదర్శ పాఠ శాలల కింద చేపడుతున్న చేపడుతున్న విద్యుత్ పనులను వారం రోజుల్లోగా పూర్తి చేయించాలని, ఫ్యాన్లు, లైట్లను ఏర్పాటు చేయించాలని సంబంధింత పాఠశాలల ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. ఎన్నికల ముందు అన్ని సౌకర్యాలను పూర్తి చేయడంతో పాటు ఓటర్లకు ఇబ్బందులు కలుగకుండా తాగు నీరు టెంట్ ఏర్పాటు చేస్తామని తహసీల్దార్ తెలిపారు. ఆయన వెంట ఆర్ఐ కుమార స్వామి, జూనియర్ అసిస్టెంట్లు బాలు, నాగరాజు ఉన్నారు.

కంటికి రెప్పలా కాపాడుకుంటా..

● ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



రేగొండ: పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

రేగొండ: పార్టీ కోసం పని చేసే ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటానని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. ఉమ్మడి రేగొండ మండలంలోని బీఆర్ఎస్ పార్టీకి చెందిన జెడ్పీటీసీ సాయిని విజయ, పీఏసీఎస్ చైర్మన్ నడిపల్లి వెంకటేశ్వర్‌రావు, కొత్తపల్లిగోరి మండల అధ్యక్షుడు మటిక సంతోష్‌తో సహా మాజీ సర్పంచులు, పలువురు నేతలు మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో అధిక మెజారిటీ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. పార్టీలో చేరిన వారిలో ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు ఎర్రబెల్లి రవీందర్‌రావు, ఎంపీటీసీలు ఐలి శ్రీధర్, సందెల స్వప్నరాంబాబు మాజీ సర్పంచులు పాతపల్లి సంతోష్, కొమ్మిడి పద్మ, లింగంపల్లి శ్వేతరాజు, పబ్బ శ్రీనివాస్‌తో పాటు 50 మంది నాయకులు ఉన్నారు. జాతీయ ఓబీసీ చైర్మన్ కత్తి వెంకటస్వామి, వరంగల్ డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు, రాష్ట్ర నాయకులు గాజర్ల అశోక్, సంపత్‌రావు, నాయకులు గుటోజు కిష్టయ్య, ఉమేష్‌గౌడ్, మేకల భిక్షపతి, పట్టెం శంకర్, మైన భిక్షపతి, పత్తి ప్రభాకర్, ముల్కనూరు భిక్షపతి, వీరబ్రహ్మం, రమేష్ పాల్గొన్నారు.

చిట్యాల: మండలంలోని మాజీ సర్పంచ్‌లు ఇరుకులపాటి పూర్ణచందర్‌రావు, ఆకుల రవి, నాయకులు ఆరెపల్లి నర్సింహారాములు, ఈగ కోటి, పుల్ల సమ్మయ్యలతో పాటు మహిళ నాయకురాలు, కార్యకర్తలు మంగళవారం బీఆర్ఎస్ పార్టీ నుంచి దాదాపు 50 మంది కాంగ్రెస్‌లో చేరారు. జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే సత్యనారాయణరావు వారిని పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ మహిళ జిల్లా అధ్యక్షురాలు గుమ్మడి శ్రీదేవి, టేకుమట్ల జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, జిల్లా, మండల నాయకులు దొడ్డి కిష్టయ్య, చిలుకల రాయకొమురు, రాజ్‌మమ్మద్, దబ్బెట అనిల్, నరేష్, శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి: భూపాలపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సమక్షంలో పీఏసీఎస్ చైర్మన్ సంపెల్లి నర్సింగరావుతో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు మంగళవారం కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరిన నాయకులకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో గాజర్ల అశోక్, పున్నం చందర్ రావు పాల్గొన్నారు.

గణపురం: మాజీ సర్పంచ్ నారగాని దేవేందర్ గౌడ్ బీఆర్ఎస్ పార్టీ నుంచి తన అనుచరులతో ఎమ్మెల్యే గండ్ర సత్యనారయణ రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో గణపురం మాజీ ఉపసర్పంచ్ పోతర్ల అశోక్ యాదవ్, నాయకులు పోతర్ల మల్లికార్జున్ పాల్గొన్నారు.

టేకుమట్ల: మండల కేంద్రంతో పాటు, మండలంలోని గర్మిళ్లపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సత్యనారాయణరావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్‌గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో పెంట రంజిత్, మామిండ్ల రమేష్, కొలుగూరి కైరత్, సుధాకర్, రాజేష్, రాములు, దేవరాజు, రమణయ్య, పైడి, వీరస్వామి, రాజేశం, రాజయ్య, రాంబాబు, శ్రీధర్, రమేష్, తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, రవీందర్, పైడి, సదానందం, సంపత్ పాల్గొన్నారు.



మొగుళ్లపల్లి: పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే

సిబ్బంది అంకితభావంతో పనిచేయాలి



సమావేశానికి హాజరైన వైద్యాధికారులు, వైద్య సిబ్బందితో డీఎంహెచ్ఓ మధుసూదన్

పలిమెల: ఆరోగ్య సిబ్బంది అంకితభావంతో పనిచేసి ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ చల్ల మధుసూదన్ వైద్యారోగ్య సిబ్బందికి సూచించారు. అంబట్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని నీలంపల్లి, పంకెన, పలిమెల ఆరోగ్య ఉప కేంద్రాల సిబ్బందితో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మధుసూదన్ మాట్లాడుతూ అభివృద్ధి చెందని మండలాల జాబితాతో ఉన్న పలిమెలను అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలపాలన్నారు. గర్భిణుల నమోదు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవం అయ్యేలా ప్రోత్సహించాలన్నారు. బరువు తక్కువగా పుట్టిన నవజాత శిశువుల సంరక్షణ, జాతీయ ఆరోగ్య నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా నడుచుకోవాలని చెప్పారు. బీపీ, షుగర్, కాన్సర్ పరీక్షలు నమోదు చేయుట, సంక్రమిత వ్యాధి నిర్మూలన దిశగా ప్రయత్నం చేయడంపై ఆరోగ్య సిబ్బంది దృష్టి సారించాలని ఆదేశించారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ కొమురయ్య, డాక్టర్లు శ్రీదేవి, ఉమాదేవి, నాగరాణి, వైద్యాధికారి డాక్టర్ రామారావు, పీఓఎం భానుప్రకాశ్, డీపీఓ చిరంజీవి, డీడీఎం మధుబాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ అందించాలి



శిక్షణ తరగతుల్లో అధికారులు, సిబ్బంది

భూపాలపల్లి రూరల్: విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండకుండా నిరంతరం ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని టీఎస్ఎన్‌పీడీసీఎల్ జీఎం కమర్షియల్ బీకం సింగ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సింగరేణి గనుల వృత్తి శిక్షణ కేంద్రం కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా ఆపరేషన్ సర్కిల్ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న జేఎల్ఎం, ఏఎల్ఎం, లైన్‌మెన్, లైన్ ఇన్‌స్పెక్టర్, సీనియర్ లైన్‌మెన్, ఫోర్మెన్లకు శిక్షణ, అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ శిక్షణ తరగతలకు టీఎస్ఎన్‌పీడీసీఎల్ జీఎం కమర్షియల్ బీకం సింగ్ హాజరై అవగాహన కల్పించారు. వినియోగదారులతో మర్యాదగా మాట్లాడుతూ, బాధ్యతతో పనిచేస్తూ విద్యుత్ శాఖకు మంచి పేరు తీసుకురావాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే పునరుద్ధరణ చర్యలు త్వరగా తీసుకోవాలని ఆదేశించారు. సబ్ స్టేషన్లు, విద్యుత్ లైన్ల మరమ్మతుల పనుల నిమిత్తం ప్రజలకు ముందస్తు సమాచారం ఇవ్వాలన్నారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తిచేసి విద్యుత్ సరఫరా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి ఎస్ఈ మల్చూర్ నాయక్, డీఈ నాగరాజు, ఏడీలు, ఏఈలు, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ పాలనలోనే పేదలకు న్యాయం



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

భూపాలపల్లి రూరల్: పది సంవత్సరాల బీజేపీ పాలనలో పేద మధ్య తరగతి వాళ్లకు న్యాయం జరిగిందని ఆ పార్టీ నాయకులు అన్నారు. వరంగల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్‌ను గెలిపించాలని కోరుతూ.. పట్టణంలోని వార్డుల వారిగా బీజేపీ నాయకులు ప్రచారం నిర్వహిస్తున్నారు. భూపాలపల్లి అర్బన్ అధ్యక్షుడు సామల మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని రాంనగర్ ఎండీ క్వార్టర్స్‌లో, 29వ వార్డులో ఆవుల సంతోష్ ఆధ్వర్యంలో, 17వ వార్డులో దొంగల రాజేందర్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కరోనా సమయంలో ప్రతి ఒక్కరికి ఉచితంగా వ్యాక్సిన్ ఇచ్చి కరోనా మహమ్మారి నుంచి దేశాన్ని కాపాడినటు వంటి గొప్ప మహనీయుడు ప్రధాని మోదీ అన్నారు. ప్రతి ఒక్కరూ కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో అరూరి రమేష్‌ను ఎంపీగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక శక్తులపై అప్రమత్తంగా ఉండాలి

వెంకటాపురం(కె): అసాంఘిక శక్తులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వెంకటాపురం సీఐ బండారి కుమార్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కొత్తగుంపు గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో తనిఖీలు నిర్వహించారు. గ్రామంలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో ఏమైనా సమస్యలు ఉంటే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. గ్రామంలోకి ఎవరైనా అనుమానిత వ్యక్తులు వచ్చినట్‌లైతే తక్షణమే సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వ్యక్తుల వివరాలు గోప్యంగా ఉంచుతామని అన్నారు. మావోయిస్టులకు ఎవరూ సహకరించ వద్దని సహకరించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఎస్సై తిరుపతి రావు, సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ కమెండెంట్ బలకవీందర్ సింగ్, సివిల్ పోలీసులు, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది ఉన్నారు.

కొండగట్టుకు తరలిన మాలధారులు



కొండగట్టుకు వెళ్తున్న హనుమాన్ మాలధారులు

మల్హర్: మండల కేంద్రం తాడిచర్ల గ్రామానికి చెందిన హనుమాన్ మాలధారణ స్వాములు మంగళవారం కొండగట్టుకు తరలివెళ్లారు. హనుమాన్ చిన్న జయంతి సందర్భంగా స్వాములు గ్రామంలోని హనుమాన్ దేవాలయంలో అభిషేకాలు, అర్చనలు తదితర పూజలు కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఇరుమడి నెత్తిన పెట్టుకొని కొండగట్టుకు తరలివెళ్లారు.

ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం దేవస్థానం పరిధిలోని గుండం చెరువు కట్ట మీద శ్రీఆంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ జయంతి సందర్భంగా అభిషేక పూజలు నిర్వహించారు. మంగళవారం స్వామివారికి ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్రీనివాస్, భక్తులు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

పని ఒత్తిడితోనే ఆత్మహత్య

● పోలీసులకు ఫిర్యాదు చేసిన శ్రావణి తండ్రి సాంబయ్య

గణపురం: మండలంలోని కర్కపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్న పల్లెబోయిన శ్రావణి తను నివాసముంటున్న గాంధీనగర్ గ్రామంలో ఉరివేసుకొని చికిత్స పొందుతూ.. ఈనెల 22న చనిపోయిన విషయం విదితమే. శ్రావణి ఆత్మహత్యకు కారణం పని ఒత్తిడే అని ఆమె తండ్రి సాంబయ్య గణపురం ఎస్సై సాంబమూర్తికి మంగళవారం ఫిర్యాదు చేశారు. కర్కపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా ఐదు సంవత్సరాలుగా పని చేస్తున్న శ్రావణికి కుమారుడు అన్విక్ చంద్ర(3), కూతురు జైస్విక 16 నెలల పాప ఉంది. తాను విధుల్లోకి వెళ్తు తన పిల్లలను సరిగా చూసుకోవడం లేదని పలుమార్లు తమకు చెప్పినట్లుగా ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. తమ కూతురు ఆత్మహత్యకు కారణం పని ఒత్తిడితో తన చిన్న పిల్లలను సరిగా చూసుకోవడం లేదనే కారణంతోనే ఆత్మహత్య చేసుకున్నారని ఫిర్యాదులో వివరించినట్లు ఎస్సై సాంబమూర్తి తెలిపారు.

విద్యుత్ షాక్‌తో పాడి గేదె మృతి



పాడిగేదె వద్ద బాధితురాలు కోమల

ములుగు రూరల్: విద్యుత్ షాక్‌కు గురై పాడిగేదె మృతి చెందిన సంఘటన మండలంలోని మేడివాగు సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. ములుగు గ్రామానికి చెందిన జక్కుల కోమల గేదెలు కొనుగోలు చేసుకోని పాల వ్యాపారం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తుంది. రోజు వారిలాగానే గేదెలను కాపరి మేడివాగు వైపు మేతకు తీసుకువెళ్లాడు. మేడివాగు నుంచి పంట పొలాలకు నీరు అందించే రైతులు విద్యుత్ తీగలు కిందనుంచి వేయడంతో గేదె కాళ్లకు చుట్టుకొని షాక్ గురై మృతి చెందినట్లు కాపరి తెలిపాడు. పాడి గేదె విలువ సుమారు రూ.90 వేలు ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితురాలు వేడుకుంది.

సుధీర్‌కుమార్ గెలుపు అవసరం



మాట్లాడుతున్న గండ్ర వెంకటరమణారెడ్డి

భూపాలపల్లి రూరల్: కాంగ్రెస్ పార్టీ మెడలు వంచి ఇచ్చిన హామీలు అమలు చేయించాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి డా.సుధీర్ కుమార్ గెలుపు చాలా అవసరమని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. మంగళవారం భూపాలపల్లి మండలంలోని అటవీ గ్రామాలైనా నాగారం, ఆజాంనగర్‌లో బీఆర్ఎస్ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందనర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో వెంకటరమణారెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతు రాజ్యం పోయి దళారుల రాజ్యమేలుతుందన్నారు. గ్రామాల్లో ప్రజలంతా ఒక్కసారి ఆలోచించాలన్నారు. రూ.2 లక్షల రుణ మాఫీ కావాలన్నా, రూ.15 వేల రైతు బంధు రావాలన్నా, మహిళలకు రూ.2500 రావాలన్నా, రూ.4వేల పెన్షన్ రావాలంటే, పంటకి రూ.500 బోనస్ రావాడం కోసం పోరాటం చేయాలంటే బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ సుధీర్‌కుమార్ గెలువాల్సిన అవసరం ఉందన్నారు. తాను అధికారంలో ఉన్నప్పుడు సమస్య ఉంది అని తన దగ్గరకు వస్తే కూర్చోబెట్టి సమస్య పరిష్కారం కోసం పని చేశాను తప్పా కండువా కప్పుకుంటేనే చేస్తా లేదంటే చేయను అని ఏనాడూ అనలేదన్నారు. ప్రస్తుతం భయపెట్టి, ప్రలోభ పెట్టి కాంగ్రెస్‌లో పార్టీలో చేర్చుకుంటున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రాజిరెడ్డి, జంగేడు పీఏసీఎస్ చైర్మన్ మేకల సంపత్‌కుమార్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

మొగుళ్లపల్లి: మండలంలోని రంగాపురం గ్రామంలోని పోల్నేని రాజేశ్వర్‌రావు ఆయిల్‌పామ్ తోటలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో పూత తీసివేసే పద్ధతి (అబ్లేషన్)పై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యాన శాఖ అధికారి సంజీవరావు మాట్లాడుతూ.. ఆయిల్ పామ్ మొక్క నాటిన 14 నెలల నుంచి 18 నెలల వరకు మగ, ఆడ పూత వస్తుందని, సరైన పద్ధతిలో పరిమాణంలో నీటి తడులు, ఎరువులను అందించాలన్నారు. లేకుంటే ఎక్కువగా మగపూలు, తక్కువగా ఆడ పూలు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలిపారు. వచ్చిన పూతను మూడున్నర సంవత్సరాల వరకు అబ్లేషన్ పరికరాల ద్వారా తీసి మొక్క మొదట్లో మల్చింగ్ కోసం వేయాలన్నారు. మొక్క నాటిన 4వ సంవత్సరం నుంచి దిగుబడి వస్తుందన్నారు. పూత తీయడానికి ఉపయోగించే శూలం లాంటి అబ్లేషన్ ఇనుప పరికరాలను సువెన్ ఆయిల్ నర్సరీ రేగొండ మండలం నుంచి గాని ఈజీ ఫామ్ టూల్స్ కంపెనీ, జాజుల కుంట, ద్వారకా తిరుమల మండలం, ఏలూరు, ఆంధ్రప్రదేశ్ ద్వారా ఖరీదుపై పొందవచ్చని తెలిపారు. జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ భాస్కర్, ఉద్యాన అధికారులు అధికారులు సునీల్ కుమార్, ఆయిల్ ఫామ్ కంపెనీ అధికారి అరవింద్, రైతులు రాజేశ్వరరావు, భూమారావు, శేషగిరిరావు, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది



సన్మాన సభలో ఉపాధ్యాయులు

రేగొండ(కొత్తపల్లిగోరి): ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది అని జెడ్పీఎస్ఎస్ కొత్తపల్లిగోరి ప్రధానోపాధ్యాయురాలు మాధవిలత అన్నారు. మంగళవారం కొత్తపల్లిగోరి పాఠశాలలో హిందీ పండిట్‌గా విధులు నిర్వహిస్తున్న మహమ్మద్ ఇస్‌హాఖ్ అలీ పదవీ విరమణ సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 33 సంవత్సరాలు ఉపాధ్యాయ వృత్తిలో ఉండి ఎందరో విద్యార్థులకు హిందీ భాషపై మక్కువ కల్పించారని కొనియాడారు. పదవీ విరమణ పొందుతున్న ఇస్‌హాఖ్ అలీని ఉపాధ్యాయ బృందం శాలువతో సన్మానించి మెమెంటో అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీఎస్ఎస్ నందిగామ ప్రధానోపాధ్యాయుడు అనురాధ, యుటీఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు రఘుపతి రెడ్డి, ఉపాధ్యాయ బృందం, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల నాగవెల్లి



నాగవెల్లి నిర్వహిస్తున్న అర్చకులు

రేగొండ: మండలంలోని రూపిరెడ్డిపల్లి గ్రామంలోని సీతారామాంజనేయ ఆలయంలో శ్రీరామనవమిని పురస్కరించుకుని సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కాగా గత వారం రోజులుగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం సీతారాముల నాకబలి (నాగవెల్లి) కార్యక్రమాన్ని పండితుల మంత్రోచ్ఛరణాల నడుమ నిర్వహించారు. సాయంత్రం గ్రామంలోని పురవీధుల్లో చిన్న రథంపై సీతారాముల శోభాయాత్ర అంగరంగ వైభవంగా నిర్వహించారు. వీధులన్నీ భక్తుల రామనామస్మరణతో మార్మోగాయి. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బండారి కవితదేవేందర్, ఆలయ చైర్మన్ బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కమిటీ సభ్యులు ముడుతనపల్లి శంకర్, బండారి రవి, పంచగిరి రవీందర్, కుచన రాజుకుమార్, సర్వా కుమారస్వామి, భిక్షపతి, చిదర్ల రవి, గటిక భిక్షపతి, పగడాల సదానందం, తిరుపతి. అర్చకులు ప్రశాంత్‌చార్యు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

వాజేడు: పార్లమెంట్ ఎన్నికలు ఇంకా 20 రోజులు ఉండటంతో పోలీసులు ముమ్మర తనిఖీలను చేపట్టారు. మండలంలోని వాజేడు, పేరూరు ఎస్సైలు వెంకటేశ్వరరావు, రమేష్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ చేస్తున్నారు. వాహనాల్లో డబ్బుల తరలింపుపై ప్రత్యేకంగా పరిశీలిస్తున్నారు. ప్రయాణికుల బ్యాగులతో పాటు వాహనాల్లో క్షుణ్ణంగా పరీక్షిస్తున్నారు. పోలింగ్ సమయం సమీపిస్తున్న సందర్భంగా రాజకీయ నాయకులు డబ్బులను ముందస్తుగానే గ్రామాల్లోకి చేరవేయవచ్చుననే కోణంలో ఈ తనిఖీలను ముమ్మరం చేశారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



సత్యవతి (ఫైల్)

వెంకటాపురం(కె): రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందడంతో పాటు మరోకరి గాయాలైన సంఘటన మండల పరిధిలోని యోగితానగర్ గ్రామ సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. చర్ల మండలం గొంపెల్లి గ్రామానికి చెందిన లక్ష్మణరావు, అతని భార్య సత్యవతి(55) ద్విచక్రవాహనంపై వాజేడు మండలం కొప్పుసూరు గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. ఈ క్రమంలో యోగితానగర్ గ్రామ శివారుల్లో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే ప్రయత్నంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడటంతో సత్యవతి అక్కడికక్కడే మృతి చెందింది. లక్ష్మణరావుకు గాయాలు కావడంతో వెంకటాపురం వైద్యశాలకు తరలించి చికిత్స నిర్వహించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.